గయ్యాళిగౌరమ్మ ప్రహసనము

[పాత్రలు:—గౌరమ్మ: మహాదేవశాస్త్రి రెండవభార్య; మహాదేవశాస్త్రి: డిప్టీకలక్టరు; రామమ్మ: వంటలక్క; సుబ్బాయమ్మ: మహాదేవశాస్త్రితల్లి, గౌరమ్మఅత్త; సీతారామమ్మ: మహాదేవశాస్త్రిమొదటిపెళ్లాము రెండవకూతురు; రమణమ్మ: గౌరమ్మకూతురు. రంగము: ప్రవేశము: భోజనశాల.]

మహా:—ఏమె? రా రా అని అంతసేపుకుతిన్నావు. కాళ్లకు నీళ్లేవి? అంగవస్త్రమేది? ఏమిలేకుండా అంతతొందరపెట్టేదెందుకు?

గౌర:—ఏం? నేనే పెట్టాలా ఏమిటి? మీ అమ్మాయి లేవరైనా పెట్టేరేమో అని అనుకున్నాను. కాస్తపెడుతే అరిగిపోతారా ఏమిటి?

మహా:—ఏమి? వాళ్లెందుకుపెట్టాలి? నువ్వేపెట్టాలి.

గౌర:—మీసంపాదనంతా నేనేతింటున్నానా? ఏటికేడాది తినేవాళ్లుచేస్తే తప్పా? ఓ! నాకు పెట్టేవస్తువు లెక్కువ ఐపోయినది యీ అరవచాకిరి చేయడానికి. నేనేమో గతిలేనిదానివట. దిక్కులేని దానినట. నాదిక్కు ఆరిపోయిందట. ఈలాంటిమాటలు మీతల్లి చేత పిల్లలచేత పడుతూ ఎవరు చేయగలరు? నాకు వెయ్యిరూపాయిాలున్నాయి. మహారాజులా నేనుతిని పదిమందికి పెట్టుతాను.

మహా:—అయితే, ఇంతకీ ఏమైన ప్రసాదం తినమన్నావా? లేకపోతే ఆఫీసుకుపోనా - చెప్పు [అని మహాదేవశాస్త్రి కాళ్లుకడుక్కొని తలుపుమీదవున్న అంగవస్త్రము తడుపుకొని మొహము తుడుచుకొనుచుండెను.]

సుబ్బా:—[ఇంటిలోపలనుండి] నరసమ్మ వెలపలవున్నది. లేకపోతే అదే చేసిఉండేది.

గౌర:—ఓ! నువ్వాఆవిడా చేసేపనులేఅన్నీని. పీనులనెంట పరుగెత్తుచున్నాయి. గారుండడము చేతనే భూమిమీద చినుకుపడుతోంది. రోజూ ఆవిడా మీరే చేస్తున్నారుగాబోలు? మనుమరాళ్లంటే ఆలా పడి చస్తావు. ఎంతసేపు మనుమరాళ్లంటేనే అపేక్ష. నీవాళ్లు పెద్దరాయిపెట్టుతారుండు. [అని విసుగుకొనుచు పీటవేసి కంచము పెట్టెను. వంటమనిషి రామమ్మ వడ్డించెను. మహాదేవశాస్త్రి భోజనముచేయుచుండెను. గౌరమ్మ యిటువటు ఏదో పనివున్నదానివలె తిరుగుచు రామమ్మను మైలపట్టెను.]

సుబ్బా:—(లోపలనుండి అదిచూచి) అయ్యో! మాలసంత! అడతలకువెళ్లనేనా వెళ్లకపోయినా? రామమ్మా! ఈకొంపలో మడిమైలా లేదు. ఏదో యింతతినడమేగాని ఆచారవ్యవహారము, పూజాపునస్కారాలు లేవు. ఆవిడ సిమప త్తినదానిలా తిరుగుంది. పో దబ్బునపో స్నానంచేసిరా ఏంగావాలో నే వడ్డిస్తాను.

గౌర:—నాకు సిమప త్తిందీ? నీమనుమరాళ్లకు సిమె త్తింది. నీకూతురుకె త్తింది. నాకేమీ శిమప త్తలేదు. ఈలాంటి కుళ్లుమాటలు పడుతూ ఎవరు ఆచారంగావుంటారు? మీమనుమరాళ్లుంటున్నారుగా! కావలసినంత ఆచారంతప్పులన్నీ మీదగ్గిరవుంచుకొని నన్నిలా నల్లేరుమీదబండిలాగు ఎందుకు అనడం? నామాటలన్నా, నాపిల్లమాటలన్నా అంతచకచక. ఎప్పుడు పక్షపాతమేకదా! వాళ్లకోలాగా, నాకోలాగ. వాళ్లకు పెరుగోసి, నాకునీళ్లోసి. ఏముంది? మళ్లీ పెద్దదానవు. ఈలాగేటమ్మా! చేయడం? వాళ్లు నీనెత్తిమీద రాయిపెట్టేరా? నేపెట్టకపోయినానా? అంత పక్షపాతమెందుకు?

278

సుబ్బా:—వూరుకో, అమ్మా! తల్లీ! నిన్నేమీఅనలేదు. నీకు నీపెద్దలకు ఒకదండం. తప్పవస్తే క్షమించమ్మా! తల్లీ! నువ్వూనేను అనుకుంటే వాళ్లమీాదికెందుకెడుతావు. ఏమైనాఅంటే వాడు అన్నంవదలి లేచిపోతాడు.

గౌర:—నీకు ఆపేక్ష యెక్కడవుందో అక్కడేఎత్తుతా. ఎత్తనునరి? నన్ను నీవేమైనాఅంటే నేను వాళ్లని, నిన్నుకూడా అంటాను? ఎందుకంత హెక్కుస్సగామాట్లాడుతావు? నిమ్మళంగామాట్లాడలేవు?

మహ:—(పెరుగుఅన్నంతింటూ) ఇస్స. ఏమిటీగోల? ఆముండ ఎప్పుడూ ఏదోవొక కుళ్లుమాట అంటూనేవుంటుంది. నీవు ఏడుస్తూనేవుంటావు. ఏమీఎరుగని నంగనాచులలాగ పత్తిత్తులలాగ వాళ్లు సన్నిసన్నంగాఅంటారు. నీవు బడబడలాడుతావు. ఇందు ఎవరుతీసిపోరు. ఆముసిలిముండ చెప్పనక్కరలేదు. గడ్డోతుముండ. అందుకే భగవంతుడు నక్కలన్నిటినీ ఒకచోటికి, నవరానులన్నిటినీఒకచోటికి చేరుస్తాడు. మీాయిష్టమువచ్చినట్లేడవండి. అసలుపిల్లలమీాద పెళ్లిచేసుకోడం నాదే బుద్ధితక్కువ.

సుబ్బా:—పిల్లలేంజేశారు? ఆడదాన్ని వంచుకోలేక ఆలాఏడుస్తున్నావు. న్యాయాన్యాయాము విచారించక పేడాబెల్లం ఏకంచేస్తున్నావు.

మహ:—చేస్తేచేశానులే. పోనీలే. [అనిబల్కుచు మేడమీాదికిబోయెను.]

గౌర:—[హస్తచాలనమొనర్చుచు] మీాబుద్ధితక్కువగాదు. నాబుద్ధితక్కువ అంతా. లేకపోతే పిల్లలమీాద రెండోపెండ్లివానిని చేసుకోడమేమిటి? చేసుకున్నానుగనుకనే 'దేవుడారాముడా' అంటూ మీాజీవానికి, మీాతల్లిజీవానికి ఉసూరుమని ఏడుస్తున్నా. తిండికికూడా మొహమువాచి కుళ్లుమాటలు సవతిపిల్లలచేత మీాతల్లిచేత పడలేక శరీరం చిల్లుపడిపోతోంది. ఉత్తమయిల్లాలినిగనుక గాని లేకపోతే యింకొకర్తైతే యీపాటికి లేచి చక్కాబోదురు.

రామ:—వూరుకుందురమ్మా! పెద్దవారు ఏదోవకటిఅంటారు. ఇంతలో వచ్చినదేముంది? పెద్దలు అనడము చిన్నలుపడడము విధాయకముగదా?

గౌర:—పెద్దవాళ్లేమిటి?......నేనుపడనమ్మా! ఇదివరదాకాపడ్డానుగాని యికపడను. నేనేమి వెర్రిగౌరమ్మనుగాను ఎల్లకాలం పడడానికి.

సుబ్బా:—నేనేమన్నానమ్మా! ఏదోవకటిపెట్టుకుని మొగుడూపెళ్లాం మీాదకువస్తారు. వందలకువందలు చెల్లుతున్నాయి. పెట్టినవూరగాయలు చెల్లుతున్నాయి. తిండికి మొహంవాచావని చెప్పతోంది ఆయిల్లాలు. ఇంకేమిచెప్పమన్నావు? ఎప్పటివో తవ్వితే ఏంచెయ్యమన్నావు? తల్లిపోయినపిల్లల్ని పెంచేను. ఉంటే ఆపేక్షవుంటుంది. ఏంచెయ్యమన్నారు? నాజోలు నాపిల్లజోలు నీవు ఎత్తవద్దందె. ఆఖరికి అల్లరిచేస్తూవుంటేకూడ పెద్దదాన్నిగదా అని కోపంచెయ్యబోతే వల్లగాదనడాయను. ఏమిచెయ్యనమ్మా! ఆపేక్షపడి వాళ్లకేంపెడుతున్నాను? దిక్కుమాలినదేముడు నన్నుచూశాడుగాడు. ఎవర్నిసంతోషపెట్టను నేనుబ్రతికి. వెళ్లినదిగాదు. [అని ఏడ్చును. ఒంటిగంటఅగుటచే స్కూలునుండి సీతారామమ్మ వచ్చినది.]

సీతా:—రామమ్మగారూ! అన్నముపెట్టండి. ఇల్లు చాలా సందడిగావుందే, చుట్టాలెవరైనావచ్చేరా ఏమిటి?

గౌర:—నీలాంటి, మీానాయనమ్మలాంటివాళ్లుంటే వెయ్యివందిచుట్టాల పెట్టు. చుట్టాలుగూడ ఎందుకు? ఒక్కరోజులోనే హడలి పారిపోతారు.

సీతా:—నీతో అనలేదమ్మా! తల్లీ! రామమ్మగారితోఅన్నాను. వూరుకో.

గౌర:—నేనూ నీతో అనలేదు. నువ్వు వూరుకోమంటే వూరుకుంటానా? మానమంటే మానుతానా? అంత పొక్కనెస్సుగా మాట్లాడుతావేమి? చిన్న పెద్ద తారతమ్యములేక.

సీతా:—రామమ్మగారూ! నాకు వంటింట్లో పెట్టండి. అక్కయ్యకు అన్నం పెట్టేరా?

రామ:—లేదమ్మా! మాకు యీభాగోతంతోటే సరిపోతోంది. ఏం పెట్టను?

సీతా:—సరి. ఈపూట నాకు శెలవు. అన్నం పెట్టండి. దానికి పెట్టి తింటాను [అని నాయనమ్మతో] నాయనమ్మా! నీవు వూరుకోవుగదా! ఏమీ జవాబు చెప్పవద్దంటే ఏదో వకటి అంటావు. అది బ్రహ్మాండమైపోతుంది.

సుబ్బా:—పాడిచెయ్యండే, అమ్మా! ఇంతదాక మీ నాయన అన్నాడు. ఇక మీరనండి. నేనేమి నోరెత్తడంలేదే. తల్లీ! చాదస్తంవుండనిగనుక ఏదో ఆచారముతో నమంటానుగాని నాకెందుకే? వాళ్ల డబ్బు జోలికెళ్లుతున్నానా? ఏగానిజోలికెళ్లుతున్నానా? ఇంతకూ నాఘటము పెళ్లినదిగాదు. నాకొడుక్కు బరువై పోయాను. [అని కండ్ల నీరు దెచ్చుకొనును.]

రామ:—సీతారామమ్మగారూ! ఈపూట ఆవిడ ఏమీ అనలేదండి. పాపము ఇంతకు ఆవిడరోజులు మంచివిగావు. అరవయ్యోపడి అగ్నిగుండము అన్నట్లు ఇంత సిరిసంపత్తువుండని ఆయిల్లాలిమనస్సుకు శాంతిలేదు.

సీతా:—ఏమి చెయ్యమన్నారు? ఎవరికర్మం వారనుభవించాలి. ఇంతకు మానాయనమ్మ మౌనమవలంబించమంటే అవలంబించదు. అదివక్కటిచేస్తే బాగుండును: పాపము ఇదివరకులాగ అన్నిటికీ వెళ్లడములేదు. అయితేమాత్రమేమి రోజా వెళ్లడములేదు.

రామ:—అమ్మాయిగారూ! ఎలావున్నా యీ ఇంట్లో మాటదక్కదండి.

గౌర:—రామమ్మగారూ! ఆనక శ్రీరంగనీతులు చెపుదురుగాని ముందు అన్నం పెట్టండి. ప్రాణం పోతోంది.

రామ:—ఇప్పుడేకాదండి వచ్చేరు? ఇందాకటినుంచి కనిపెట్టుకొనివున్నాను. రాలేదు. తొందరపడితే ఏలా? వస్తున్నాను.

సుబ్బా:—అమ్మా! మీరందరు మీ ఇండ్లకు వెళతారు. నాకేగదా ఎక్కడాదిక్కులేదు. నేనెంత నోరుమూసుకొనివున్నా మీనాయనకేమి తెలియదుగదా! నేనుగడ్డోతుముండనిట. ఏమిచేయనమ్మా! కండ్లు మూసుకొని హరాహరాయని ఏగోదారిలోనైనదిగాలి.

గౌర:—(ముద్దమింగుతో) మీగయ్యాళితనాలు, రాలుగాయితనాలు తెలిసినవారుగనుకను, మంచివారుగనుకను, ఆయనన్యాయముమాట్లాడబట్టిగాని లేకపోతే నన్నుమీరంతాయీపాటికి ఏంచేసేవారో? అందరిసంగతులు అందరిచిత్రాలు బాగా ఆయనకు తెలునును గాబట్టి బ్రతికిపోతున్నా.

సీతా:—నాయనమ్మా! జవాబుచెప్పితె వట్టు.

సుబ్బా:—నోరెత్తకుండా పాడిచేస్తున్నారే మీరు. నోరుమూసుకొనివుంటె లాభమేమైనా వుందా? అన్నీ వక్కలాగెవున్నాయి.

సీతా:—నోరుమూసుకుంటెనే లాభములేకపోతె నోరుమెదిపితె లాభముందా? రెండూవేస్తేచప్పట్లు. వూరుకో.

రామ:—అమ్మా! శీతారామమ్మగారూ! అక్కయ్యకు అన్నంపెట్టేరండి. మీబావగారింట్లోనే వున్నట్లున్నారు. అయ్యో! మొగవాళ్లువున్నారన్న భయములేదండి యీఇంట్లో.

గౌర:—ఓ! వారందరికీ ఉండదా ఏమిటి? నాకు ఉండడానికి? బుద్ధవరపువారంటే శుద్ధబుద్ధితక్కువ వాళ్లని ఇదివరకే పేరుమోశారు. వీరికీ క్రిందాళ్లప్రక్కలా పరిగెత్తుతోంది. ఆయనవుంటే ఏంభయంలేదు. పెద్ద బావగారు ఆక్షింగులలో జమ. ఆయన పెండ్లామంటే, మరదలంటే, నాయనమ్మంటే నేనేమిబరితెగలేదు లెండి. ఏమమ్మోయి! సీతారామమ్మా! నాకుశ్రమబూనినదట. మీ నాయనమ్మగారిమాటకు సంబరపడు. ఈ లాంటి వెధవమాటలంటూంటే ఎవరుపడతారు?

రామ:—అబ్బా! గౌరమ్మగారూ! అయినదేదో అయినది వూరుకోండురు. ఫలానికలక్టరుగారిభార్య, గట్టిగామాట్లాడుతారంటే బాగావుండదు వూరుకోండి.

గౌర:—కూతుళ్లకూ తల్లికీ లేనిగౌరవము, మర్యాదనాకువస్తుందా ఏమిటి? కలక్టరుగారితల్లిపిల్లలు సుద్ధగయ్యాళివాళ్లని ఇదివరకేదేశమంతా చెప్పుకుంటున్నారు. ఇక ఇప్పుడువస్తుందా ఏమిటి మర్యాద? మర్యాదాలేదు మంటిగడ్డాలేదు. ఆరునెలలుసహవాసముచేస్తే వారువీరవుతారు. వారికివచ్చినమర్యాదే నాకు వస్తుంది. ఎక్కువఏలావస్తుంది?

రామ:—గడుసు గౌరమ్మ అన్నపేరుపోనిచ్చారుగారు మొత్తానికి. ఎలామాట్లాడినా వాళ్లమీదికి వచ్చేటట్టేమాట్లాడుతారు. మీరింతగడుసువారని అయ్యగారికి తెలియదు. తెలిస్తే చాలాసంతోషిస్తారు.

గౌర:—(ముద్దసమలుతా) తెలియకేమి? ఆయన ఎన్నోసార్లు నన్ను నీవు మంచిగడసుదానవేఅన్నారు. లేకపోతే ఏమనుకొన్నారు ఈగౌరమ్మఅంటే. ఈఇంట్లో ఇంతనోరు ఇంతగడుసుదనము వుందిగనుక నే గాని, లేకపోతె, యీతల్లిపిల్లలు నన్నువీధిలోకి గెంటుదురు. అసలు యీయనచాలామంచివారని యీతల్లి వాళ్లు చాలాగయ్యాళివాళ్లని చాలామందిచెప్పేరు పెండ్లికానప్పుడేనాకు. వాళ్లు ఎలాంటివాళ్లయితేనేమి, ఆయనమంచివారుగదా అనిచేసుకున్నాను.

రామ:—(నవ్వుతూ) అమ్మా! మీకు పెండ్లినాటికెన్నేళ్లున్నవండి?

గౌర:—నాకా 10 లేక 11 ఏండ్లువుండునండి. మీరెందుకడుగుతున్నారో తెలిసినదిలెండి. నేను మొదటినుండి చాలా తెలివైనదానిని గనుక అప్పటికేనాకు అన్నిసంగతులు తెలుసును. నేనుస్వయముగా ఆయనఫొటోచూచి ఆయన నేతప్ప ఎవరినిచేసుకోనని కోరివేడిచేసుకున్నాను. ఏ మొఅడపిల్లలుగదా ఎవరింటికి వారువెళ్తారనుకొన్నానుగాని ఎల్లకాలము నా నెత్తిమీదకూర్చుని శీలగొట్టెదరని అనుకోలేదు.

సీతా:—(లోపలనుండి) నీలాగమమ్మల్నికూడ ఏరెండో పెండ్లివరునకో ఇస్తే రాకుండావుందేవాళ్లము. అలాగాకుండ మానాయనగారు జట్టుజట్టుకొలచి చిన్నవాళ్లనివెతికిచేశారు. వుండకుండా వెళ్లకుండా ఎలా అవుతుంది? రామమ్మగారూ! మీరుకూడ అన్నముపెట్టుకోండి, ఎందుకొచ్చినపోరు? తలబద్దలవుతోంది.

గౌర:—పోరు గీరే అనకు. అనకబుద్ధిచెప్పేను. మీరంతాకూడా మీతాహతునుబట్టిమాట్లాడండి. నేను పెద్దాయన పెండ్లాం నన్నమాటమరచిపోకండి. జాగ్రత. ఎవరితాహతువవారుండండి. వన్నేమనుకుంటున్నారో! కూరగాయదానినిగాదు చీపురుపుల్లలా తీసిపారవేయడానికి. మీరెంతకొట్టుకుచచ్చినా నేనెలాగ కలక్టరుగారి భార్యనే. నాతరువాతనే మీరంతాను. ఎవరిమట్టుకువారె నన్నవడము. మొన్నమీబావ ఆవిడకు జవాబు చెప్పకండి తలవంచుకొని ఎవరిపనివారుచేసుకోండన్నాడు. ఆయనెవడు అలా అంతమాటనన్నడానికి. వచ్చినవాడు తనపనితనుచేసుకొనివెళ్లక యీచేతకానితీర్పులెందుకు?

రామ:—అబ్బా! ఇకకట్టిపెడుదురు. ఇమ్మల్ని కలక్టరుగారి భార్యగాదని ఎవరన్నారండి? తల్లీ! నింపాదిగాభోంచెయ్యండి. ఏంగానలీ?

గౌర:—కడుపునిండిపోతోంది వెధవతిండి. ప్రతిరోజూ సరీగా భోజనాలవేళే దెబ్బలాట పెడతారండి. తిన్నతిండివంటబట్టుటలేదు. నేనునాపిల్ల ఎప్పుడుపక్కనేవుండి సుఖపడతామంగాని మహాకష్టపడుతున్నాను. రామమ్మగారూ! [అని కన్నులనీరు చెంగుతో తుడుచుకొనుచు] రమణమ్మా! రమణమ్మా! ఇలారా ఈకంచాలుగడిగెయ్యి. నాకంచముపకటి నేనుకడుక్కుంటాను.

రమ:—అబ్బా! నేనుకడగలేను. నాచెయ్యికోసుకుపోయింది.

గౌర:—ఛీ! మొద్దుముండా! కడుగు. కడక్కపోతె తలబద్దలుకొడతాను.

రమ:—నీళ్లలోపెడితె నాచెయ్యిమండుతుంది. నేకడగను.

గౌర:—దెయ్యమ్ముండా! నామాటకెదురుచెప్పతావుఁ? [అనిబల్కుచు అంటచేతితో వాల్గుగుద్దులుగుద్దెను. ఆబాలికక్రిందపతికిలబడి గిలగిలకొట్టుకొనుచు పెద్దగ ఏడ్చుచుండెను.]

రామ:—ఏమి గయ్యాళితనమమ్మా! ఎక్కడాచూడలేదు. మరీని. పిల్లనలాకొట్టిచంపుతారా? అయ్యగార్కి ఇవిఏమి తెలియవు. మిమ్మల్ని ఎవరో ఏమటో అంటారనుకుంటారుగాని యీగందరగోళం తెలియదు. నాకు పిచ్చెత్తిపోతోంది, బాబూ! మాలేనికొంపలలోగూడ యీపోకడలుసాగవు. ఇప్పుడిలావచ్చిందిగాని నా అవస్త మావాడుమగవారు వస్తున్నారంటే గడగడ. రహస్యముమాట్లాడినట్లే మాట్లాడ్డం. నేనూమాతోటి కోడలు ఎప్పుడైనాగట్టిగాకబుర్లుచెప్పుకొంటె మాఅత్తగారు "ఏమర్రో గొడవ"అని ఒక్కకేకబెట్టేవారు. అంతే. ఇలా ఎక్కడాచూడలేదమ్మా!

గౌర:—ఈదిక్కుమాలిన గయ్యాళి సవతిపిల్లలమూలాన్ని రాక్షసి అత్తగారిమూలాన్ని ఇలాగట్టిగా మాట్లాడడంపిల్లల్ని కొట్టడంవస్తుందిగాని లేకపోతె నాకర్మ మేమికాలింది ఇలాకొట్టడానికి.ఇంతకు నాకర్మము, పిల్లకర్మం ఇలావుంది. నోరులేనిదానినిగాబట్టి వాళ్ల ఆటలుసాగుతున్నాయి. [అని తింటూవున్న అన్నములో చెయ్యిగడుక్కొని భోజనమొనర్చుచున్న శీతారామమ్మ కెదురుగవచ్చి] శీతారామమ్మా! ఈరోజున మీవాన్ననురానివ్వండి. మీఅందరిరోగం, అందులో మీనాయనమ్మరోగం చప్పగకుదిర్చి, కమ్మెచ్చునసాగదీసినట్లుసాగతీయించకపోతె నాపేరు కైలాసగౌరికాదు. [అని పల్కుచు గౌరమ్మబల్లపతిలుపుప్వైచి మేడమేదికిబోయెను.]

ప్రజోత్పత్తి

శ్రీమతి ఆవటపల్లి కృష్ణవేణిగారు

ఆదిలోక్రిందుమీదయు సంతమందు
మోదముంగూర్చిప్రజకు ప్రమోదచనియె.
భరతజాతికి స్వేచ్ఛావిభవముగూర్ప
శ్రీప్రజోత్పత్తి! రమ్ము సుశ్రీలనిమ్ము.
అలఘుసత్యాగ్రహోద్యమకలవరమున
భూరివాణిజ్యదుస్థితి కారణమున
పోయినప్రమోద ప్రజడీలిపోయినారు
నీవయిన శాంతినొడగూర్చి నెగడుమమ్మ.

దివ్యశాంతస్వరూపి గాంధిమహర్షి
విమలమానసుడైన ఇర్విన్ ప్రభుండు
కలిసి భారతజనని శృంఖలమువిప్ప
పూనిరీపని నీదయపూర్తిసేయుము;
ఈమహాత్ములకృషి ఫలియించునేని
భారతీయులు ఈప్రజోత్పత్తిమాకు
పారతంత్ర్యతవదలి శుభమ్ముగలిగె
అంచుమున్ముందు నిన్నుతలంచుకొనరె.